స్వామి వివేకానంద సూక్తులు



నేను నరకానికి వెళ్ళడం వాళ్ళ నా సోదరులకు ఉపయోగం ఉంటుందంటే, నరకానికి వెళ్ళడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నానని అనగలిగిన వాడే నిస్వార్థపరుడు.



Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 60 | గురువారం 08 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# హస్తినలో హైటెన్షన్

- జ్ఞానేశ్ బ్రో బై బై
- సీఈసీ జ్ఞానేశ్‌ను తొలగించే వరకూ పోరు ఆగదన్న ఇండీ నేతలు
- జంతర్‌మంతర్, షాంగ్రీలా హోటల్ వద్ద తీవ్ర ఉద్రిక్తత
- జంతర్‌మంతర్‌లో నేలపై పడుకున్న ప్రియాంక
- రాహుల్, ప్రియాంకను బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నాపై 100 కేసులైనా బెదిరే ప్రసక్తే లేదు..
- ఎఫ్ఐఆర్‌లు నాకు పతకాలు: రాహుల్
- ఎంపీలను కొడతారా.. ఈడ్చి పడేస్తారా..
- రాజ్యాంగం కోసం ప్రాణాలైనా అర్పిస్తాం : ప్రియాంక





న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఇండీ కూటమి ఎంపీల నిరసనలతో బుధవారం కూడా దేశ రాజధాని అట్టుడికింది. మంగళవారం ఆకాశవాణి భవన్ వద్ద ఆందోళనలు హోరెత్తగా, బుధవారం జంతర్‌మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. లంచ్ మీట్ తర్వాత ఈసీ ఆఫీసుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్ష ఎంపీలు బస్సు ల్లో తరలివెళ్లారు.

అయితే షాంగ్రి-లా హోటల్ సమీపంలో పోలీసు లు వారిని అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డపైనే భైటాయించి నిరసన తెలిపారు. దీంతో జంతర్‌మంతర్ సమీపంలో పరిస్థితి హైటె న్షన్‌గా మారింది. రాహుల్‌గాంధీని, ప్రియాంకగాంధీని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు


- మిగతా 2లో..




## జ్ఞానేశ్ రాజీనామా వరకు
# పోరాటం ఆగదు

- తనను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులపై అసహనం
- ఢిల్లీలో రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన రేవంత్‌ను అడ్డుకున్న పోలీసులు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఈసీని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపణ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే


- మిగతా 2లో..




# మనం సాధిస్తాం

- వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాలను 2047 నాటికి చేరుతాం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో దేశం కీరోల్‌గా నిలుస్తుంది
- స్వయం సమృద్ధినీ చేరుకుంటాం
- గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ దేశంగా ఎదుగుతాం
- అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేసిచూపుతాం
- నాకు ప్రజలే దేవుళ్లు.. బీజేపీ కార్యకర్తలే నా బలం : ప్రధాని మోదీ


2లో



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## ఆవిన్‌కు కొత్త ల్యాబ్..
# సీఎం విజయ్ ప్రారంభం

చెన్నై - సూర్య వాస్తవం

తమిళనాడు రాజధాని చెన్నైలోని మాధవరంలో ఆవిన్ డెయిరీకి సంబంధించి కీలక కార్య క్రమాలు జరిగాయి. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఆవిన్ రాష్ట్ర కేంద్ర ప్రయోగశాల కొత్త అనుబంధ భవనాన్ని బుధవారం ప్రారంభించారు.


- మిగతా 2లో..




# కుప్ప కూలిన 25 గజాల భవనం

- చిన్నారి మృతి, పలువురికి గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న పలువురు
- ఢిల్లీ న్యూ సీమాపురిలో ఘటన

న్యూఢిల్లీ - స్యూర్య వాస్తవం

ఢిల్లీలో 25 గజాల్లో నిర్మించిన నాలుగు అంతస్థుల భవనం కుప్పకూలి ఓ చిన్నారి మృతి చెందగా, 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. భవన శిథిలాల కింద చిక్కుకున్న వారిని స్థానికులు



రక్షించే ప్రయత్నం చేస్తూ, పోలీసులు, అగ్నిమాపక శాఖలకు సమాచారం


- మిగతా 2లో..


## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో
# సీఎం చంద్రబాబు భేటీ

- గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ
- రెండు రోజుల పర్యటనలో ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం
- విశాఖ మెట్రో, పోలవరం, పుష్కరాల నిధులపై విజ్ఞప్తి చేసే అవకాశం
- నేడు సీఐఐ సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమ య్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా


- మిగతా 22లో..




# డ్రగ్స్‌పై యుద్ధం..

- సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం

అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకు న్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.


- మిగతా 2లో..

## జ్ఞానేశ్ రాజీనామా వరకు
# పోరాటం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)
ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# మనం సాధిస్తాం

- వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాలను 2047 నాటికి చేరుతాం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో దేశం కీరోల్‌గా నిలుస్తుంది
- స్వయం సమృద్ధినీ చేరుకుంటాం
- గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ దేశంగా ఎదుగుతాం
- అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేసిచూపుతాం
- నాకు ప్రజలే దేవుళ్లు.. బీజేపీ కార్యకర్తలే నా బలం : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం :** ప్రధాని నరేంద్ర మోదీ 'మనం సాధిస్తాం' అనే సరికొత్త నినాదాన్ని ఇచ్చారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంతోపాటు పలు లక్ష్యాలను పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌తో పాటు, మోదీ ఐదు ప్రధాన లక్ష్యాలను వెల్లడించారు. ఇందులో ఒకటి ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం, రెండోది ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం, మూడోది భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం, నాలు గోది ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం, ఐదోది అంతరిక్షంలోకి మానవసహి త యాత్రను చేపట్టడం ఉన్నాయి. 'నాకు ప్రజలే దేవుళ్లు.. బీజేపీ కార్యకర్తలే నా బలం. నన్ను 25 ఏళ్లుగా నాపై నమ్మకం ఉంచిన భారత ప్రజలకు నేను శిరసు వంచి నమస్కరిస్తున్నాను' అని మోదీ అన్నారు. దేశ ప్రజలందరి కోసం వినాయకుడిని ప్రార్థించాను. ప్రజలకు సేవ చేసేందుకు మరింత శక్తి ఇవ్వాలని కోరుకున్నానని తెలిపా రు. ప్రభుత్వ అధినేతగా మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వికసిత్ భారత్ సంకల్ప సభ జరిగింది. ఇందులో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు. 25 సంవత్సరాల క్రితం మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన 2001 అక్టోబర్ 7న, కేశుభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఒకప్పుడు అసాధ్యమైనవి ఇప్పుడు సాధ్యమయ్యాయని మోదీ అన్నారు. 'అభివృద్ధి చెందిన భారత్ కోసం 2026లో మనం కంటున్న కల కచ్చితంగా నిజమవుతుంది. భారత్ ఇప్పుడు ఆగిపోవడానికి ఎలాంటి కారణం లేదు.

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో
# సీఎం చంద్రబాబు భేటీ

(మొదటి పేజీ తరువాయి)
చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగనున్నాయి.

ఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు. నేడు మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని రేపు రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోదీ 25 ఏళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.

## ఆవిన్‌కు కొత్త ల్యాబ్..
# సీఎం విజయ్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)
ఈ భవనాన్ని సుమారు రూ. 2.23 కోట్లతో నిర్మించినట్లు అధికారులు తెలిపారు. కొత్త ల్యాబ్‌లో ఆధునిక పరికరాలతో పాలు, పాల ఉత్పత్తుల నాణ్యతను మరింత వేగంగా, కచ్చితంగా పరీక్షించే సదుపాయాలు ఏర్పాటు చేశారు. అలాగే తాగునీరు, వ్యర్థజలాల నాణ్యతను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పరీక్షించే సౌకర్యాలు కూడా అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ల్యాబ్ ప్రారంభం అనంతరం సీఎం విజయ్ మాధవరం కేంద్ర డెయిరీ కార్య కలాపాలను స్వయంగా పరిశీలించారు. పాల సేకరణ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, పంపిణీ ప్రక్రి యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాధవరం డెయిరీ ప్రస్తుతం రోజుకు సుమారు 4.5 లక్షల లీటర్ల పాలను నిర్వహించే సామర్థ్యంతో పనిచేస్తోంది. ఇదే సమ యంలో మాధవరంలో నిర్మాణంలో ఉన్న కొత్త డెయిరీ ప్రాజెక్టు పనులను కూడా సీఎం విజయ్ పరి శీలించారు. భవిష్యత్‌లో చెన్నై నగర పాల అవసరాలను తీర్చే లక్ష్యంతో సుమారు రూ. 152.26 కోట్లతో ఈ కొత్త డెయిరీని నిర్మిస్తున్నారు. ఆధునిక ఆటోమేషన్‌తో కూడిన ఈ యూనిట్‌కు రోజుకు సుమారు 7 లక్షల లీటర్ల పాల నిర్వహణ సామర్థ్యం ఉండేలా ప్రణాళిక రూపొందించారు. పనులను వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇటీవల చెన్నైలో ఆవిన్ పాల లభ్యతపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యం లో సీఎం మాధవరం డెయిరీని సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పాల సేకరణ నుంచి వినియోగదారులకు చేరే వరకు మొత్తం సరఫరా వ్యవస్థను ఆయన సమీక్షించారు.

# హస్తినలో హైటెన్షన్





(మొదటి పేజీ తరువాయి)
ప్రయత్నించగా వారు రోడ్డుపైనే సీఈసీని తొలగించాలని నినదించారు. పోలీసులతో రాహుల్, ప్రియాంకగాంధీ, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రాహుల్, ప్రియాంక దగ్గరికి పోలీసులు రాకుండా చుట్టూ ఎంపీ లు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రక్షణ వలయంగా నిల్చున్నారు.

ఓ క్రమంలో ప్రియాంకగాంధీ రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. తీవ్ర ఉద్రిక్తతల మధ్యే రాహుల్, ప్రియాంక, విపక్ష ఎంపీలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. రాహు ల్‌ని ఛత్రసాల్ స్టేడియానికి తీసుకెళ్లాల్సిన బస్సు టైర్లను కాంగ్రెస్ కార్యకర్తలు పంక్చర్ చేశారు. దీంతో ఆయనను వేరే బస్సులో బారాఖంబా రోడ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రియాంక గాంధీని, ఇతర ప్రతిపక్ష నాయకులను ఛత్రసాల్ స్టేడియానికి తీసుకెళ్లారు. ఛత్రసాల్ స్టేడియం వద్ద కూడా పరిస్థితి తీవ్ర ఉత్కంఠంగా మారింది. ఎంపీలను కొడుతారా, ఈడ్చి పడేస్తారని రాహుల్‌గాంధీ ఆగ్ర హం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, ఇతరులను 'న్యాయం ముందు నిలబెడ తాం' అని ఆరోపించారు. ఆ నలుగురు రాజ్యాంగంపై, ప్రజల వాణిపై దాడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. షాంగ్రి-లా హోటల్ సమీపంలో రాహుల్‌గాంధీని బలవంతంగా అదుపులోకి తీసుకుని వాహనంలోకి ఎక్కించగా, అందులో కూర్చునే ఆయన మాట్లాడారు. దేశంలోని 'అత్యంత పవిత్రమైన అంశాన్ని' కాపాడుకునే పోరాటం ఇదని



రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమా ర్ రాజీనామా చేసే వరకు ప్రతిపక్షాల నిరసన ఆగదని తేల్చిచెప్పారు. తమను అడ్డుకు నేలా ప్రధాని నరేంద్ర మోదీ లేదా హోం మంత్రి అమిత్ షా చేయగలిగింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు.

ఈ మేరకు కూడా ఆ యన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ వీడియో లో రాహుల్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, జ్ఞనేష్ కుమార్ ఇవన్నీ చేయవచ్చని ఆరోపించారు. 'కానీ మేము వారిని చట్టం ముందు నిలబెడతాం. ఆ నలుగురినీ చట్టం ముందు నిలబెడతామని నా హామీ' అని పేర్కొన్నారు. వారు ఈ దేశంలోని అత్యంత పవిత్రమైన అంశంపై దాడి చేశారు. వారు రాజ్యాంగంపై దాడి చేశారు. ప్రజల గొంతుకపై దాడి చేశారు. దీనికి వారు మూల్యం చె ల్లించుకోక తప్పదు అని స్పష్టం చేశారు. రెండు గంటల తర్వాత బారాఖంబా పోలీస్ స్టేషన్ నుంచి రాహుల్‌ను విడుదల చేశారు.

**ప్రాణాలను ఇస్తాం: ప్రియాంక**
షాంగ్రి-లా హోటల్ సమీపంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకులను అదుపులోకి తీసుకుని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించారు. ఇక్కడ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. 'పోలీసులే నన్ను కిందికి తోసేశారని, నన్ను రక్కేశారని, మమ్ములను దారుణంగా ట్రీట్ చేశారని ఆరోపించారు. రాజ్యాంగం కోసం తమ ప్రాణాలను సైతం ఇస్తామని అన్నారు. దేశం రాజ్యాంగం ద్వారా నడుస్తుంది. ఈ రాజ్యాంగం కోసం మా ప్రాణాలను సైతం అర్పిస్తాం అని ఆమె పేర్కొన్నారు.

**ఎన్ని కేసులైనా పోరాడుతాం: ఖర్గే**
ప్రసిద్ధసాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీలందరికీ మల్లికార్జునఖర్గే మధ్యాహ్న భోజన విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న శైలిపై నేతలు చర్చించారు. అనంతరం మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం ఆగే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ బద్ధ సంస్థలను పరిరక్షించడానికి, 140 కోట్ల మంది ప్రజల హక్కుల కోసం ఈ పోరాటాన్ని దేశవ్యాప్తంగా సాగిస్తామని స్పష్టం చేశారు. తర్వాత రాహుల్ గాంధీ సహా ముఖ్య నేతలంతా కలిసి ఒకే బస్సులో జంతర్‌మంతర్ వైపు బయలుదేరారు.



# డ్రగ్స్‌పై యుద్ధం..

(మొదటి పేజీ తరువాయి)
ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కుప్ప కూలిన 25 గజాల భవనం

(మొదటి పేజీ తరువాయి)
అందజేశారు. బుధవారం మధ్యాహ్నం ఈద్గా సమీపంలోని న్యూ సీమాపురి ప్రాంతంలో 3 గంటలకు ఓ భవనం కూలిపోయింది. దీంతో దీనిపక్కనున్న మరో రెండు నివాస భవనాలకు కూడా నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు వెంటనే రంగంలోకి దిగారు. రాత్రివరకు శిథిలాల నుంచి ఎనిమిది మందిని రక్షించగా, ఓ చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని స్థానికంగా ఉన్న రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద 10 మంది వరకు చి క్కుకున్నారన్న స్థానికుల సమాచారం మేరకు రెస్క్యూ చర్యలను కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతం గుండా వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో పోలీసులు రహదారిని మూసివేసి రెస్క్యూ చర్యలు చేపట్టారు. షాదారా జిల్లా మేజిస్ట్రేట్ అజయ్ కుమార్, డీసీపీ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా శిథిలాల కింద చిక్కుకున్న వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు.

## సంపాదకీయం

# అమెరికా నిజంగానే దివాళా తీస్తుందా?




మొదటి నుంచీ ఎలాన్ మస్క్‌కి ఒక ప్రత్యేకత ఉంది. ఇతరులు భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నప్పుడు.. తాను ఆ భవిష్యత్తును తయారు చేయాలని ప్రయత్నిస్తుంటారు. ఎలక్ట్రిక్ కార్ల నుంచి అంతరిక్ష ప్రయాణం వరకు ఆయన చేసిన ప్రయోగాలు అందుకు ఉదాహరణ. అందుకే అమెరికా ఆర్థిక భవిష్యత్తుపై ఆయన చేసిన హెచ్చరికను కూడా మార్కెట్లు, టెక్ ప్రపంచం, పెట్టుబడిదారులు ఆసక్తిగా గమనిస్తున్నాయి. " అమెరికా దివాళా తీసే అవకాసం ఉంది" అని చెప్పినప్పుడు అది సాధారణ కామెంట్‌గా మిగలలేదు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వర్గాల్లో చర్చ మొదలైంది.మస్క్ చెప్పింది నిజంగా అమెరికా రేపే దివాళా తీస్తుందన్న హెచ్చరికేనా? లేక భారీగా పెరుగుతున్న అప్పులు, వడ్డీ భారం, బడ్జెట్ లోటు గురించి ఆయన చెబుతున్న అసలు సమస్యను మనం మరో కోణంలో చూడాలనా? అమెరికా జాతీయ రుణం గురించి మాట్లాడినప్పుడు మస్క్ ఈ తీవ్రమైన హెచ్చరిక చేశారు. ఏఐ రోబోటిక్స్ సాంకేతికతలు గనుక లేకపోతే అమెరికా ఆర్థికంగా తీవ్ర చిక్కుల్లో పడుతుందని, అప్పుల ఊబి నుంచి గట్టెక్కడానికి ఇవి తప్ప మరో మార్గం లేదని ఆయన స్పష్టం చేశారు.అయితే మస్క్ మాటల అంతరార్థం "అమెరికా దగ్గర రూపాయి (డాలర్) కూడా లేకుండా పోయింది" అని కాదు; పెరుగుతున్న అప్పుల వేగాన్ని దేశ ఆర్థిక వృద్ధి దాటలేకపోతే అసలు సమస్య మొదలవుతుందనేదే ఆయన ఆందోళన. అమెరికా ఇప్పటికే అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ ఖర్చు రికార్డు స్థాయికి చేరడమే ఈ భయానికి ప్రధాన కారణం.అమెరికా జాతీయ రుణం ఇప్పటికే 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక విధానాలు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగలేవని, రుణం–జీడీపీ నిష్పత్తి భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారుతుందని అమెరికా ట్రెజరీ స్వయంగా అంగీకరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందిఇక్కడ అసలు సమస్య అప్పు చేయడం మాత్రమే కాదు, దానిపై చెల్లిస్తున్న వడ్డీ భారం ఏటికేటా కొండలా పెరిగిపోవడం. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం కేవలం అప్పులపై వడ్డీ చెల్లించడానికే ఏడాదికి సుమారు 1 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. అంటే ప్రభుత్వం సేకరించే ప్రతి ఐదు డాలర్ల ఆదాయంలో దాదాపు ఒక డాలర్ కేవలం వడ్డీలకే సరిపోతోంది. "అప్పు చేసి పప్పు కూడు తిన్నంత కాలం బాగానే ఉన్నా, అసలు కంటే వడ్డీయే ఎక్కువైనప్పుడు" అసలు కథ మొదలవుతుంది. అమెరికా విషయంలో సరిగ్గా ఇదే జరుగుతుండటంతో ఆర్థిక నిపుణులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆమోదయోగ్యమైన 'రిజర్వ్ కరెన్సీ' అయిన డాలర్‌ను ముద్రించే అధికారం అమెరికాకు ఉంది. కాబట్టి దేశం పూర్తిగా దివాళా తీసి, మూతపడిపోతుందనే కోణంలో మస్క్ వ్యాఖ్యలను చూడలేం. కానీ, పెరుగుతున్న అప్పుల వల్ల వడ్డీ భారం పెరిగి, దానికోసం మరింత అప్పు చేయాల్సి రావడం, దానివల్ల మార్కెట్‌లో వడ్డీ రేట్లు మరింత పెరిగిపోవడం లాంటి 'డెట్ స్పైరల్' ఏర్పడే ప్రమాదం ఖచ్చితంగా ఉంది. దిగ్గజ ఆర్థికవేత్త రే డాలియో, జేపీ మోర్గాన్ సీఈఓ జేమీ డైమన్ వంటి వారు కూడా ఇదే రుణ విషవలయం గురించి అమెరికాను హెచ్చరించడం గమనార్హం.అప్పుల సుడిగుండం నుంచి బయటపడటానికి ఏ దేశానికైనా రెండే మార్గాలుంటాయి: ఒకటి ఖర్చులు తగ్గించుకోవడం, రెండు ఆర్థిక వ్యవస్థను వేగంగా పెంచడం. మస్క్ రెండవ మార్గాన్ని ఎంచుకున్నారు. రోబోటిక్స్ రంగాల వల్ల మానవ ఉత్పాదకత పదింతలు పెరిగితే, వస్తువులు, సేవల ఉత్పత్తి విపరీతంగా పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరిగి, ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీ ఆదాయం వస్తుంది.ఫలితంగా అప్పు–జీడీపీ నిష్పత్తి తగ్గుతుందని మస్క్ భావిస్తున్నారు. ఆయన ఆలోచనలో రోబోట్ అనేది కేవలం ఒక యంత్రం కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించే గ్రోత్ ఇంజిన్. అయితే, అంత త్వరగా అంతటి ఉత్పాదకతను సాధించగలదా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి.అమెరికాలో పెద్ద ఆర్థిక సంక్షోభం తలెత్తితే అది వారి సొంత సమస్య మాత్రమే కాదని, గ్లోబల్ ఎకానమీలో భాగంగా భారత్‌పై కూడా దాని ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని మనం గ్రహించాలి. అమెరికా బాండ్ యీల్డ్స్ పెరిగితే విదేశీ పెట్టుబడిదారులు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి తమ డబ్బును ఉపసంహరించుకుని అమెరికా ఆస్తుల్లో పెట్టుబడి పెడతారు. దీనివల్ల భారత స్టాక్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు రావడమే కాకుండా రూపాయి విలువ పడిపోయే అవకాశం ఉంది.డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే మన దిగుమతుల ఖర్చు భారీగా పెరుగుతుంది. ముఖ్యంగా భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రవాణా ఖర్చులు ప్రియమవుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగి హైదరాబాద్‌లో ఉండే ఒక సామాన్య కుటుంబం నెలవారీ బడ్జెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. భారతీయ ఐటీ రంగానికి ఇది రెండు రకాల పరిణామాలను తెచ్చిపెట్టవచ్చు. ఒకవైపు అమెరికా కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రాజెక్టులను కుదిస్తే ఐటీ అవుట్‌సోర్సింగ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. మరోవైపు, తమ ఖర్చులను వేగంగా తగ్గించుకోవడానికి వారు ఆశ్రయిస్తే, మన ఐటీ కంపెనీలకు సరికొత్త అవకాశాలు తలుపు తడతాయిమొత్తానికి, మస్క్ చెప్పినట్లుగా అమెరికా వెంటనే దివాళా తీయకపోవచ్చు కానీ, పెరుగుతున్న అప్పులు మరియు వడ్డీ భారం నిజంగానే ఆ దేశానికి పెద్ద తలనొప్పిగా మారాయి. మస్క్ హెచ్చరికలో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికీ, అమెరికా అప్పుల సమస్యను ప్రపంచం ఇక ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయలేదనేది పచ్చి నిజం.అందుకే ఇప్పుడు ఆలోచించాల్సింది "అమెరికా దివాళా తీస్తుందా,లేదా?" అని కానే కాదు, పెరుగుతున్న అప్పుల భారం కంటే వేగంగా, అమెరికా తన ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించగలదా లేదా అనేదే! దీనికి కాలమే సమాధానం చెప్పాలి.



# వానొచ్చేనంటే..వరదొస్తాది..!

- వంకను మింగేస్తున్నా.. పట్టించుకునేవారేరీ?
- భారీ వర్షం వస్తే 500 కుటుంబాలు జలమయం?
- వంక ఆక్రమణలపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదంటున్న గ్రామస్తులు
- అధికారుల మౌనం.... దేనికి సంకేతం..?
- అక్రమ మట్టి పూడికలపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



**గార్లదిన్నె - సూర్య వాస్తవం :**
గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని కల్లూరు--అగ్రహారం గ్రామాల మధ్య ఉన్న వంక ఆక్రమణలకు గురవుతోందన్న ఆరోపణలు స్థానికంగా ఆందోళనకు దారితీస్తున్నాయి. పాత మ్యాపుల్లో వంకగా నమోదై ఉన్న ప్రాంతం ప్రస్తుతం కొత్త మ్యాపుల్లో స్పష్టంగా కనిపించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. జాతీయ రహదారి--44 సమీపానికి వచ్చిన తర్వాత వంక స్థలాలు కబ్జాకు గురయ్యాయని వారు ఆరోపిస్తున్నారు.

ఎగువపల్లి ఫారెస్ట్ కొండ ప్రాంతాల నుంచి వర్షపు నీరు పొలాల మీదుగా ఈ వంకలోకి ప్రవహిస్తుందని, అదేవిధంగా కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువల నుంచి వచ్చే నీరు కూడా ఇందులో కలుస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వంక ప్రవాహ మార్గం సక్రమంగా లేకపోతే కల్లూరు, అగ్రహారం ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**2022లో ఇళ్లలోకి వరద నీరు**

గతంలో 2022లో భారీ వర్షాల సమయంలో వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించిన ఘటనను గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం వంక ప్రాంతాల్లో మట్టి పోసి ఎత్తు పెంచడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని వారు చెబుతున్నారు. అగ్రహారం పరిధిలోని నివాస ప్రాంతాలతో పాటు పంచాయతీ కార్యాలయం, రైస్ మిల్లులు, ఫ్యాక్టరీలు, కాలనీలు తదితర ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**రాత్రింబవళ్లు మట్టి తరలింపు?**

జాతీయ రహదారి--44 సమీపంలోని కొండ ప్రాంతాల నుంచి భారీ యంత్రాలతో మట్టిని తవ్వి, ట్రిప్పర్ల ద్వారా తరలించి వంక ప్రాంతాలను సుమారు 5--6 అడుగుల మేర పూడ్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విలువైన వంక స్థలాలను పూడ్చి వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**అధికారులు స్పందించాలంటున్న ప్రజలు**

వంక ఆక్రమణలపై రెవెన్యూ, పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పాత మ్యాపులు, ప్రస్తుత రికార్డులను పరిశీలించాలని వారు కోరుతున్నారు.వంక అసలు హద్దులను గుర్తించి ఆక్రమణలు ఉంటే తొలగించాలని, అక్రమంగా మట్టి తరలింపు జరిగితే మైనింగ్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే సమయంలో గ్రామాలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

## అధిక వడ్డీలతో వేధిస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్ లాంటి యాజమాన్యాలపై

# ఆర్.బి.ఐ తక్షణమే సమగ్ర విచారణ జరిపి సీజ్ చేయాలి

**రాయదుర్గం - సూర్య వాస్తవం :** అధిక వడ్డీలతో వ్యాపారులను, ప్రజలను, ఉద్యోగులను, చిరుద్యోగులను వేధిస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్ పై ఆర్‌బీఐ తక్షణమే సమగ్ర విచారణ జరిపి సీజ్ చేయాలని ఏఐవైఎఫ్, ఏపీ రైతు సంఘం,ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తున్నాయి. రాయదుర్గం పట్టణం, కనేకల్ రోడ్డులో ఉన్న శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయం ఎదుట బుధవారం బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు.



**అసలు మోసం ఏంటంటే:**

- ఐవీ పేరుతో మేనేజర్ లోన్ అప్రూవల్ చేసినందుకు రంగస్వామితో రూ.1,00,000 వసూలు
- ఇన్సూరెన్స్ అని చెప్పి మరో రూ.50,000 వసూలు
- మేనేజర్ 1.80 పైసల వడ్డీ అంటే, ఐవీ ఏమో 1.40 పైసల వడ్డీ అంటాడు. ఇందులో ఎవరిని నమ్మాలి?
- ఈరోజుకు అసలు, వడ్డీ కట్టి లోన్ క్లోజ్ చేస్తానన్నా అధిక వడ్డీలు వేసి వేధించడం దారుణం.

బాధితుడు డాక్టర్ రంగస్వామి - రాయదుర్గం గోడు:
రాయదుర్గం పట్టణానికి చెందిన డా. రంగస్వామి తన ఇంటిపై

1. 01/01/2024 న రూ.15 లక్షల లోన్: నెల ఐవీ× రూ.52,450. 25 నెలలకు రూ.13,06,350 చెల్లించారు.
2. 31/12/2024 న మరో రూ.35 లక్షల లోన్: నెల ఐవీ× రూ.1,21,334. 15 ఐవీ×లకు రూ.16,96,024 చెల్లించారు.

రెండు లోన్లకు కలిపి ఇప్పటికే దాదాపు రూ.30 లక్షలు చెల్లించారు. వేధింపులు భరించలేక మిగతాది కట్టి క్లోజ్ చేద్దామని వెళ్తే, కట్టిన 30 లక్షల లెక్క లేదు, ఇంకా రూ.46 లక్షలు కట్టాలని యాజమాన్యం కరాకండిగా చెబుతోంది. "రెండేళ్లుగా మీరు చెప్పిన వడ్డీ ప్రకారమే కట్టాను, రెండేళ్లు ముందే క్లోజ్ చేస్తుంటే వడ్డీ మినహాయింపు ఎందుకు ఇవ్వరు?" అని అడిగితే, తమకు రావాల్సింది కట్టాల్సిందే అని మేనేజర్, డీఎం బెదిరిస్తున్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి తిప్పేస్వామి, ఏఐ×ఖీ జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ..

"శ్రీరామ్ ఫైనాన్స్ కు వచ్చే వాహనదారులు, గోల్డ్ లోన్లు, ప్రాపర్టీ లోన్లు, చిరు వ్యాపారులు, చిరు ఉద్యోగులు ఇలా రకరకాల ప్రజలు లోన్లు తీసుకొని ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు ఈ మేనేజర్ ఎన్ని లోన్లు చేశాడు, ఎన్ని అప్రూవల్స్ చేశాడు, ఎన్ని ఇన్సూరెన్సులు చేశాడో సమగ్ర విచారణ జరిపితే మరింత దోపిడీ బయటపడుతుంది. తక్షణమే ఆర్‌బీఐ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో దశలవారీగా శ్రీరామ్ ఫైనాన్స్ ఎదుట ఆందోళనలు, అవసరమైతే ముట్టడికి కూడా పిలుపునిస్తామని" హెచ్చరించారు.

**మా డిమాండ్స్**

1. శ్రీరామ్ ఫైనాన్స్ రాయదుర్గం బ్రాంచ్ పై ఆర్‌బీఐ సమగ్ర విచారణ జరిపి సీజ్ చేయాలి.
2. ఐవీ, మేనేజర్, పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
3. డా. రంగస్వామి విషయంలోనే కాకుండా ఎవరికైనా ముందస్తుగా చెల్లించే

వడ్డీ మినహాయింపు ఇచ్చి లోన్ క్లోజ్ చేసే వెసులుబాటు కల్పించాలి.

## జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ఎస్.ఎం.డి. ఇస్మాయిల్

**- కదిరి నియోజకవర్గ పార్టీ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ**



**కదిరి - సూర్య వాస్తవం :** తాడేపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎస్.ఎం.డి. ఇస్మాయిల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఈ భేటీ జరిగింది.ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కదిరి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలు తదితర అంశాలపై ఇస్మాయిల్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, స్థానిక రాజకీయ పరిణామాలపై కూడా ఇరువురు చర్చించినట్లు పేర్కొన్నారు.

## పామిడి సర్కిల్ ఇన్స్పెక్టరుగా మనోహర్ బాధ్యతల స్వీకరణ



**పామిడి- సూర్య వాస్తవం:**పామిడి మండల పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మనోహర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంతకల్ వన్ టౌన్ సిఐగా విధులు నిర్వహి స్తుండగా బదిలీపై పామిడి కొచ్చినట్లు తెలిపారు. ఈసందర్భంగా సి ఐ మనోహర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో ప్రజా సేవే లక్ష్యంగా పోలీస్ స్టేషన్ కి వచ్చిన ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని, అసాం ఘిక కార్యక్రమాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, దౌర్జన్యాలు దోపి డీలు దొంగతనాలు కబ్జాలు ద్రోహాలు చేసేవారంటే నాకు నచ్చదని అలాంటి వారిపై ప్రత్యేకమైన నిఘా ఉంచి అణచివేస్తామని తెలియజేశారు.

## గ్యార్మీ పండుగకు ఆత్మీయ ఆహ్వానం

**- కె.ఎం. షకీల్ సఫీని ఆహ్వానించిన కె.ఎల్.ఎస్. జ్యువెలర్స్ అధినేత మహబూబ్ బాషా**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని కె.ఎల్.ఎస్. జ్యువెలర్స్ అధినేత, అయ్యావారిపల్లి మహబూబ్ బాషా గారి నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్న గ్యార్మీ పండుగ ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు కె.ఎం. షకీల్ సఫీ గారిని ఆత్మీయంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ, గ్యార్మీ పండుగ సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో మత పెద్దలు, ముతవల్లిలు, ప్రముఖులు, స్థానికులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. భక్తి, ఆధ్యాత్మికత, సోదరభావం, సామాజిక ఐక్యతను చాటేలా కార్యక్రమాన్ని నిర్వ హించనున్నట్లు తెలిపారు.

## కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ జాతీయ సభ్యుడిగా ఆర్. శ్రీనివాసులు

**- వినియోగదారుల సమస్యలకు జాతీయ వేదికపై గళం**
**- ఏపీలో హక్కుల పరిరక్షణకు మరింత బలమైన స్వరం**

**అనంతపురం - సూర్య వాస్తవం :**అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాపో) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. శ్రీనివాసులు కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీసీ) జాతీయ సభ్యుడిగా నియమితులయ్యారు. సీసీసీ జాతీయ అధ్యక్షులు అభిషేక్ శ్రీవాస్తవ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.జాతీయ స్థాయిలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, దేశవ్యాప్తంగా పనిచేస్తున్న వినియోగదారుల సంఘాల మధ్య సమన్వయం, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రభుత్వ సంస్థల దృష్టికి తీసుకెళ్లడంలో సీసీసీ కీలక వేదికగా పనిచేస్తోందని శ్రీనివాసులు తెలిపారు.ఆహార కల్తీ, నకిలీ వస్తువులు, అధిక ధరలు, తప్పుడు ప్రకటనలు, ఈ-కామర్స్ మోసాలు, బ్యాంకింగ్, బీమా, వైద్య సేవలు, రియల్ ఎస్టేట్ తదితర రంగాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించేందుకు తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయి వేదికపై ప్రస్తావించి, వారి హక్కుల పరిరక్షణకు మరింత బలమైన స్వరం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచడంతో పాటు వినియోగదారుల సంఘాలు, ప్రభుత్వ విభాగాలు, సంబంధిత సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తానని శ్రీనివాసులు తెలిపారు.




# ఫారం--6 మార్పులపై... సుప్రీంకోర్టు ప్రశ్నలు...!

- **అసలు అధికారం ఎవరిది?**
- **సుప్రీంకోర్టు ఆమోదం లేదన్న సీజేఐ సూర్యకాంత్**
- **మార్పులు ఎవరు చేశారు..?**
- **రికార్డులు పరిశీలిస్తామన్న ధర్మాసనం**
- **చట్టబద్ధ ప్రక్రియ లేకుండా మార్పులు జరిగాయా అన్నదే కీలక ప్రశ్న**
- **డా. ముచ్చుకోట సురేష్ బాబు**




**అనంతపురం - సూర్య వాస్తవం :** న్యూఢిల్లీ ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం--6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు ఎలాంటి ఆమోదం ఇవ్వలేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. అక్టోబర్ 5న ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం లోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ అంశంపై విచారణ సందర్భంగా, ఫారం--6లో మార్పులు జరిగి ఉంటే అవి ఎవరి ద్వారా, ఏ ప్రక్రియలో జరిగాయో ఎన్నికల సంఘం సమర్పించే రికార్డుల ఆధారంగా పరిశీలిస్తామని పేర్కొంది.ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారం--6లో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )కు సంబంధించిన అదనపు ప్రకటనను చేర్చిన వ్యవహారమే తాజా వివాదానికి కేంద్రబిందువైంది. ఎన్నికల సంఘం మాత్రం అసలు ఫారం--6లోని అంశాలను మార్చలేదని, సర్ సందర్భంగా అదనపు ప్రకటనను జతచేసినట్లు వివరణ ఇచ్చింది.

**ఫారం--6 ఎందుకు కీలకం?**

18 ఏళ్లు నిండిన అర్హులైన పౌరులు ఓటర్ల జాబితాలో తమ పేరును నమోదు చేసుకునేందుకు ఫారం--6ను ఉపయోగిస్తారు. ఇది రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 కింద నిర్దేశించిన అధికారిక ఫారం. అందువల్ల ఫారంలో మార్పులు చేయడానికి అనుసరించాల్సిన చట్టపరమైన ప్రక్రియపై ప్రశ్నలు తలెత్తాయి.సర్ సందర్భంగా ఉపయోగించిన ఆన్‌లైన్ ప్రక్రియలో దరఖాస్తుదారుల గత ఓటరు జాబితా వివరాలు, కుటుంబ సభ్యుల పేర్లు, గత సర్ కు సంబంధించిన వివరాలు వంటి అదనపు సమాచారాన్ని కోరినట్లు నివేదికలు వెల్లడించాయి.

**అసలు వివాదం ఏమిటి?**

ఫారం--6లో అదనపు ప్రకటనను చేర్చడమే కాకుండా, దానికి అనుసరించిన విధానంపైనే ప్రధానంగా ప్రశ్నలు తలెత్తాయి. ఈ మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం అంతర్గతంగా కూడా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి.ఇదే సమయంలో, సెప్టెంబర్ 26న ఎన్నికల సంఘం సర్ పూర్తయిన రాష్ట్రాల్లో అదనపు ప్రకటనను తొలగించి, రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960లో నిర్దేశించిన ఫారం--6ను ఉపయోగిస్తామని ప్రకటించింది. అయితే సర్ కొన సాగుతున్న రాష్ట్రాల్లో అదనపు ప్రకటన కొనసాగుతుందని తెలిపింది.

**సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

ఈ వ్యవహారంపై అక్టోబర్ 5న విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్య చేశారు. "ఏ మార్పు చేసిన ఫారం--6కు సుప్రీంకోర్టు ఆమోదం ఇవ్వలేదు" అని స్పష్టం చేస్తూ, ఎన్నికల సంఘం రికార్డులు సమర్పించిన తర్వాత అసలు మార్పులు ఎవరు చేశారో పరిశీలిస్తామని తెలిపారు.

మే 27, 2026న సుప్రీంకోర్టు బిహార్ సర్ కు సంబంధించి ఇచ్చిన తీర్పులో ఎన్నికల సంఘానికి సర్ నిర్వహించే అధికార పరిధి, అనుసరించాల్సిన విధానం వంటి అంశాలను పరిశీలించింది. అయితే ఆ తీర్పును ఆధారంగా చేసుకుని ఫారం--6లోని ప్రతి మార్పుకు కోర్టు ప్రత్యేకంగా ఆమోదం ఇచ్చిందా అన్నదే ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.

**చట్టపరమైన ప్రక్రియపై ప్రశ్నలు**

ఓటర్ల నమోదుకు సంబంధించిన వ్యవస్థను ప్రజాప్రాతినిధ్య చట్టం--1950, రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 నియంత్రిస్తాయి. ఫారం--6 కూడా ఈ నిబంధనల వ్యవస్థలో భాగమే.అందువల్ల ఫారం యొక్క చట్టబద్ధమైన నమూనాలో గణనీయమైన మార్పులు చేయాలంటే అవి ఏ అధికారంతో, ఏ నిబంధనల ఆధారంగా, ఏ విధానంలో అమల్లోకి వచ్చాయన్నది స్పష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది.

**ఇప్పుడు ముందున్న ప్రశ్నలు**

సుప్రీంకోర్టు రికార్డులను పరిశీలించనున్న నేపథ్యంలో మూడు అంశాలు కీలకంగా మారాయి:

ఫారం--6లో అదనపు ప్రకటనను ఎవరు చేర్చారు?
దానికి ఉన్న చట్టపరమైన అధికారం ఏమిటి?
సంబంధిత నిబంధనలను సవరించకుండానే అదనపు వివరాలను ఎందుకు కోరారు?

# స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**- భ్రూణ లింగ నిర్ధారణకు అడ్డుకట్ట వేయాలి: ఆర్డీవో శ్రీనివాస్, డీపీఎంవో శ్రీనివాసులు రెడ్డి**




**గుంతకల్ -సూర్య వాస్తవం:**గుంతకల్ డివిజన్ పరిధిలోని స్కానింగ్ కేంద్రాల్లో గర్భస్థ పిండ లింగనిర్ధారణ నివారణ చట్టం (పీసీపీఎండట్ యాక్ట్ ) నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆర్డీవో శ్రీనివాస్, డీపీఎంవో శ్రీనివాసులు రెడ్డి సూచించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో పీసీపీఎండట్ చట్టంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలు, రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్లు, ఫారం-ఎఫ్ తదితర అంశాలను చట్ట నిబంధనల మేరకు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలకు తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆడపిల్లల సంఖ్య తగ్గిపోవడం వల్ల భవిష్యత్ తరాల్లో జనాభా సమతుల్యత దెబ్బతినడంతో పాటు కుటుంబ, సామాజిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. లింగ సమానత్వాన్ని నినాదాలకే పరిమితం చేయకుండా ఆడపిల్లల ప్రాణాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.భ్రూణ లింగ నిర్ధారణను అరికట్టి ఆడపిల్లల సంఖ్యను కాపాడుకోవడం నేటి తక్షణ కర్తవ్యమని పేర్కొన్నారు. అమ్మాయిల సంఖ్యలో అసమతుల్యత ఏర్పడితే భవిష్యత్తులో తీవ్ర సామాజిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ సుజాత, గైనకాలజిస్ట్, డాక్టర్ రామాంజనేయులు, పీడియాట్రిషియన్ డాక్టర్ పవన్ కుమార్, రేడియాలజిస్ట్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గంగాధర్, డాక్టర్ హరిత, డాక్టర్ రాఘవేంద్ర, ప్రగతి మహిళా సంఘం ప్రతినిధులు రాధ, నజమునిస, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మున్సిపాలిటీ టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, గుంతకల్ డివిజన్ పరిధిలోని స్కానింగ్ కేంద్రాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి వేణుగోపాల్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, రియాజ్, ఎంఓ అసిస్టెంట్ తదితరులు హాజరయ్యారు.



# జిల్లా సదస్సును జయప్రదం చేయండి

**- తనకల్లు మండల సిపిఐ కార్యదర్శి రెడ్డప్ప**



**తనకల్లు - సూర్య వాస్తవం:**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బీ కే ఎం యు ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు కదిరి ఎన్జీవో హోం హాల్ నందు జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని బి కే యంయు జిల్లా ఉప కార్యదర్శి రమణ మరియు మండల కార్యదర్శి రెడ్డప్ప పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కామ్రేడ్ సిహెచ్ కోటేశ్వరరావు రాష్ట్ర అధ్యక్షులు వైశాఖ కార్మిక సంఘం, కామ్రేడ్ మీసాల వేమయ్య యాదవ్ సిపిఐ జిల్లా కార్యదర్శి, కామ్రేడ్ ఆవుల శేఖర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కామ్రేడ్ బి కేశవరెడ్డి రాష్ట్ర కార్యదర్శి వ్యవసాయ కార్మిక సంఘం హాజరవుతారని తెలిపారు.ఈ మేరకు తనకల్లు మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ నందుపార్టీ నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు కొట్టాలి ఇవ్వాలని, ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్లు కేటాయించి ఇంటి పట్టాలు ఇవ్వాలని, పేదలకు అన్యాయం చేసే అసైన్డ్ భూముల భూపతిలాయింపు చట్ట సవరణను రద్దు చేయాలని, అది కూడా దళితులు గిరిజనులు బడుగు బలహీన వర్గాల పేదలకు శాశ్వత జీవన భృతి కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుదల కోసం అన్ని రకాల ప్రభుత్వ భూములు అటవీ ఫారెస్ట్ భూములను వారికి ఇచ్చి రెవెన్యూ హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జరిగే జిల్లా సదస్సును ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రెడ్డప్ప సహాయ కార్యదర్శి రవి గిరిజన సంఘం నాయకులు రవీందర్ నాయక్ నాయకులు రెడ్డప్ప నిరంజన్ డప్పు కళాకారుల రమణ అంజన్నప్ప రైతులు రైతు కూలీలు కార్మికులు కర్షకులు వ్యవసాయ కార్మిక సంఘం తనకల్లు మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అనంతపురం జిల్లాలో 39 మద్యం దుకాణాలకు లాటరీ

- అక్టోబర్ 8న కలెక్టర్ సమక్షంలో డ్రా ఆఫ్ లాట్స్
- అర్హత కలిగిన దరఖాస్తుదారులు ఉదయం 7.30కే హాజరు కావాలి
- పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహణకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలో 2026--27 లీజు సంవత్స రానికి నోటిఫై చేసిన మద్యం దుకాణాల్లో 39 దుకాణాలకు డ్రా ఆఫ్ లాట్స్ (లాటరీ) విధానంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. రామమోహనరెడ్డి తెలిపారు.అక్టోబర్ 8న ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ సమక్షంలో అనంతపురంలోని జెడ్పీ కాంపౌండ్‌లో ఉన్న జిల్లా ప్రజా సంబంధాల కేంద్రం (డీపీఆర్సీ) మీటింగ్ హాల్‌లో లాటరీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జిల్లాలో మొత్తం 39 మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించనుండగా, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అత్యధికంగా 14 దుకాణాలు, తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో 7 దుకాణాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల్లో తాడిపత్రి రూరల్‌లో 2, గుంతకల్లు మున్సిపాలిటీలో 3, కళ్యాణదుర్గంలో 2, రాయదుర్గంలో 1, పామిడిలో 1, యాడికిలో 1, కనేకల్‌లో 1, కంబదూరులో 1, శెట్టూరులో 1, కుందుర్పిలో 1, సింగనమలలో 1, బుక్కరాయసముద్రంలో 1, డి.హీరేహాళ్‌లో 1, బొమ్మనహాళ్‌లో 1 దుకాణానికి లాటరీ నిర్వహించ నున్నారు.లాటరీ ప్రక్రియలో పాల్గొనే అర్హత కలిగిన దరఖాస్తుదారులు అక్టోబర్ 8న ఉదయం 7.30 గంటల్లోపు నిర్దేశిత వేదికకు తప్పనిసరిగా హాజరు కావాలని అధికారులు సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

# రాయదుర్గం నియోజకవర్గంలో నిలిచిన వైద్య సేవలు

- విధులను బహిష్కరించిన 15 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు




**రాయదుర్గం- సూర్య వాస్తవం :** రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమను వెంటనే శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన 15 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసనకు దిగారు.సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఈ నిరసన బాట పట్టినట్లు ఉద్యోగులు తెలిపారు. రోగులకు మెరుగైన సేవలందిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని వారు నినాదాలు చేశారు.కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె కారణంగా ఆసుపత్రికి వచ్చే పేద రోగులు, గర్భిణీలు, అత్యవసర చికిత్సల కోసం వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాయదుర్గం నుంచి అనంతపురం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి బయలుదేరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు: గీత, సల్మా, పద్మావతి తదితరులు మరో 12 మందికి పైగా పాల్గొన్నారు.

వారి ప్రధాన డిమాండ్స్:

1. కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి.
2. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.
3. ఉద్యోగ భద్రత కల్పించి, క్రమబద్ధీకరించాల

# ఉరవకొండ గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జ్వరాల బారిన పడిన బాలికలను పరామర్శించిన కలెక్టర్ ఓ ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** ఉరవకొండ పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్య, వసతి, భోజనం, ఆరోగ్య పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో జ్వరాల బారిన పడిన బాలికలను కలెక్టర్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ప్రస్తుతం ఆరుగురు బాలికలను ఐసోలేషన్ గదిలో ఉంచి, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.జిల్లాలో ఎండ తీవ్రతతో పాటు వర్షాలు కురుస్తుండటంతో వాతావరణ మార్పుల కారణంగా జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఇలాంటి పరిస్థితులు ఉంటే వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుని జ్వరాల బారిన పడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్స్, వార్డెన్లను ఆదేశించినట్లు తెలిపారు.అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు మెరుగైన

## స్త్రీశక్తికి ఘన విజయం...

# 14 నెలల్లో 100 కోట్ల ప్రయాణాలు...!

- రూ.3,550 కోట్ల ప్రభుత్వ వ్యయం.. మహిళలకు ప్రయాణ భారం తగ్గింపు
-మహిళల సంక్షేమానికి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి - సూర్య వాస్తవం :** అమరావతి సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం 14 నెలల్లోనే 100 కోట్ల ప్రయాణాల మైలురాయిని చేరిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 24 లక్షల వరకు మహిళలు స్త్రీశక్తి పథకం ద్వారా ప్రయాణిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలకు ప్రభుత్వం సుమారు రూ.3,550 కోట్లు వెచ్చించిందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ప్రయాణ ఖర్చు తగ్గడంతో, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడు తోందని తెలిపారు.స్త్రీశక్తి పథకాన్ని సద్వినియోగం చేసు కుంటున్న మహిళలందరికీ పయ్యావుల కేశవ్ శు భాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటూ సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాలు సాగించాలని, కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకునేందుకు ఈ పథకం ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

# అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలి!

- 3 రోజుల పాటు కోర్టు విధుల బహిష్కరణ.. రిలే నిరాహార దీక్ష




**హిందూపురం - సూర్య వాస్తవం :** హిందూపురం న్యాయవాదుల భద్రత కోసం అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు ఆందోళన చేపట్టారు. బీపీఎల్ షోరూం ఎదుట మూడు రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరించి రిలే నిరాహార దీక్షకు దిగారు.ఈ సందర్భంగా న్యాయ వాదులు మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థలో కీలకమైన భాగమైన న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వేధింపులను అరికట్టేందుకు అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.న్యాయ వాదుల భద్రత కేవలం ఒక వృత్తికి సంబంధించిన అంశం కాదని, న్యాయపాలన మరియు ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు.

**ప్రభుత్వం ముందు ప్రధాన డిమాండ్లు**

- అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలి.
- విధి నిర్వహణలో న్యాయవాదులపై దాడులకు కఠిన శిక్షలు విధించాలి.
- ప్రతి కోర్టు ప్రాంగణంలో తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలి.
- న్యాయవాదుల గౌరవం, స్వేచ్ఛ, భద్రతకు ప్రభుత్వం చట్టబద్ధమైన హామీ ఇవ్వాలి.

"న్యాయవాది సురక్షితంగా ఉంటేనే న్యాయం సురక్షితంగా ఉంటుంది" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, న్యాయవాదుల రక్షణ కోసం చట్టం అమలు చేయించే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తితో పాటు న్యాయవాదులు తిమ్మారెడ్డి, రాజశేఖర్, ఇందాద్, హిదయతుల్లా, రామిరెడ్డి, నాగేంద్ర, కర్ణప్ప శ్రీనివాసులు, శ్రీరాములు, సిద్ధ గంగప్ప, పనిభూషణ్, అతిక్, చంద్రశేఖర్ రెడ్డి, జయదూర్ రెహ్మాన్, వెంకటేష్, మనోహర్ రెడ్డి, రవిచంద్ర, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# రాత్రివేళ నేరాల కట్టడికి 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ'

- ప్రధాన జంక్షన్లు, సరిహద్దులు, సమస్యాత్మక ప్రాంతాల్లో నాకాబంధీ
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా పర్యవేక్షణ



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు రాత్రివేళల్లో ప్రజల భద్రతను పటిష్టం చేయడం, నేరాలను నియం త్రించడం, శాంతి భద్రతలను పరిరక్షించడం లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ' తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన జంక్షన్లు, అంతర్జిల్లా, అంతర్రాష్ట్ర సరిహద్దులు, సమస్యాత్మక ప్రాంతాల్లో నాకాబంధీ చేపట్టి వాహనాలను తనిఖీ చేశారు. రాత్రివేళల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని కల్పించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు, పాత నేరస్తులను గుర్తించి విచారించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు.అదేవిధంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో రాత్రిపూట



ప్రయాణించే ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు ఏటీఎం కేంద్రాలు, బ్యాంకుల వద్ద భద్రతా పరిస్థితులను పోలీసులు పర్యవేక్షించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నేరాల నియ ంత్రణ కోసం 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ' తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. రాత్రివేళల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చ రించారు. అను మానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించినప్పుడు వెంటనే డయల్ 100/112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరి ంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అడవులను రక్షిద్దాం వన్యప్రాణులకు రక్షణ కల్పిద్దాం







**దొరవారిసత్రం–సూర్య వాస్తవం:** వన్యప్రాణులైన పక్షి జాతులతో పాటు,అడవుల్లో సంచరించే ప్రతి జంతువుకు రక్షణ కల్పించాలని నేలపట్టు పక్షుల కేంద్రం సిబ్బంది బుధవారం మండల పరిధిలోని ఏకొల్లు ఎంపిపి స్కూల్ పిల్లతో ర్యాలీ నిర్వహించారు.అక్టోబర్ నెల రెండవ తేదీ నుండి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నేలపట్టు పక్షుల కేంద్రంలోని గైడ్ కన్నలి హుస్సేనయ్య విద్యార్థులకు అడవుల గురించి వన్యప్రాణుల సంరక్షణ గురించి నేలపట్టు పక్షుల కేంద్రం యొక్క విశిష్టతను గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు.విశ్వంలో పక్షులు వలన కలిగే ప్రయోజనాలను తెలిపారు.అదేవిధంగా అడవులను రక్షించడం,వన్యప్రాణులను వేటాడి చంపకుండా, ప్రతి ఒక్కరూ కాపాడాలని తెలియజేశారు. అనంతరం స్కూల్ ఆవరణంలో చెట్లను నాటడం జరిగింది అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ బాలయ్య, ప్రధాన ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు,

# బీసీలకు 34శాతం రిజర్వేషన్ కోసం పార్లమెంటులో చట్ట సవరణ చేయాలి

## -ఈగ యువరాజు నాయుడు




**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:**సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ప్రతి మండలానికి కొత్త కార్యవర్గాల ప్రకటన మరియు బీసీ రిజర్వేషన్ పోరాటంపై చర్చా కార్యక్రమం ఘనంగా జరిగింది.తిరుపతి జిల్లా అధ్యక్షులు కంభం లోకయ్య సూచనల మేరకు,సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులు ఈగ యువరాజు నాయుడు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షురాలు డా.మస్థానమ్మ,జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి,సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కన్మణి మరియు సంఘం ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు ఈగ యువరాజు నాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మాని, బీసీ సంక్షేమం కోసం మన స్ఫూర్తిగా పనిచేయాలని విమర్శించారు. రాజకీయ పార్టీలు నిజంగా బీసీలకు 34% రిజర్వేషన్ ఇవ్వాలని భావిస్తే, ముందుగా రిజర్వేషన్ల విషయంగా పార్లమెంటులో చట్ట సవరణ చేయించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.అలాగే 2024లో ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ సంకీర్ణ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని, తాము బీసీ రక్షణ చట్టాన్ని డిమాండ్ చేస్తున్నామని నియోజకవర్గ అధ్యక్షులు ఉద్ఘాటించారు.

# కనేకల్‌లో పోలింగ్ కేంద్రాల పరిశీలన...



**కనేకల్ – సూర్య వాస్తవం:** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కనేకల్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో షేక్ షావలి, ఎస్ఐ నాగమధు బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అవసర మైన భద్రతా చర్యలపై ఎస్ఐ నాగమధు సిబ్బందికి సూచనలు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో విజయసింహారెడ్డి తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు...వైసీపీ శ్రేణులు సిద్ధం

- తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి...!
- 15 పంచాయతీలే లక్ష్యం
- స్థానిక ఎన్నికలకు వైసీపీ వ్యూహం
- నీళ్లు లేకుండా హార్టికల్చర్ హబ్ ఎలా..?
- కార్యకర్తలు కదలాలి గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి
- అభివృద్ధి, సాగునీటిపై పోరాటం ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు





**అనంతపురం ప్రత్యేక ప్రతినిధి – సూర్యవాస్తవం:** చెన్నేకొత్తపల్లి స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం, కార్యకర్తల సమా వేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుబంధ విభాగాల్లో నియమితులైన నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను అందజేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం పోరాడాలని సూచించారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలతో పాటు చెన్నేకొత్తపల్లి మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో పార్టీ బలో పేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని ప్రకాష్ రెడ్డి అన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల అభిప్రా యాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేపట్టాలని సూచించారు. రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టులు 2017లో దక్కించుకున్నప్పటికీ పనులు చేపట్టకుండా అభివృద్ధిని అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు.

ఎస్కేసీ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన రోడ్డు కాంట్రాక్టుల విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందని విమర్శించారు. ఈ అంశంపై చేసిన ఆరోపణలకు సంబంధించి సంబంధిత వర్గాల వివరణ అందుబాటులో లేదని తెలిపారు.

**నీళ్లు లేకుండా హార్టికల్చర్ హబ్ ఎలా?**

రైతులకు అవసరమైన సాగునీరు అందించకుండా హార్టికల్చర్ హబ్ ఏర్పాటు ద్వారా అభివృద్ధి చేస్తామని చెప్పడం ఎలా సాధ్యమని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. లైనింగ్ పనుల కారణంగా బోర్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆరోపించారు. రైతులకు సాగునీరు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.తనపై గతంలో రూ.200 కోట్లు ఉన్నాయని దుష్ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు. తన వద్ద అంత డబ్బు ఉంటే దేవరకొండ, తోపుదుర్తి రిజర్వాయర్లను తానే నిర్మించేవాడినని అన్నారు.ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సాగునీటి హక్కుల కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా ప్రణాళిక

- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా..
- ఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- 'పల్లె నిద్ర'తో ప్రజలకు మరింత చేరువ కావాలి
- ముందస్తు చర్యలకు ఎస్పీ పి. జగదీష్ ఆదేశం





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరిగేలా జిల్లా ఎస్పీ పి. జగదీష్, జిల్లా పోలీస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.గ్రామాలు, పట్టణాల్లో వర్గ విభేదాలు, ఘర్షణలు, చిన్నచిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు, వ్యక్తులను ముందుగానే గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే నేరాలను ముందుగానే నివారించడమే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశాలను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**'పల్లె నిద్ర'తో ప్రజలకు చేరువ**

పోలీస్ అధికారులు గ్రామాల్లో రాత్రి బస చేస్తూ ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ సూచించారు. 'పల్లె నిద్ర' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.రానున్న ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, నిష్పాక్షికంగా జరిగేలా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ఎస్పీ పి. జగదీష్ స్పష్టం చేశారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- గుమ్మఘట్టలో పోలీసుల అవగాహన కార్యక్రమాలు
- సైబర్ మోసాలు, మహిళలపై నేరాలు, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన




**రాయదుర్గం – సూర్య వాస్తవం :** గుమ్మఘట్ట మండలం లోని పులకుంట, గౌనికుంట గ్రామాల్లో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, గుమ్మఘట్ట ఎస్ఐ జి. చిన్నారాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు, బాలికలపై వేధింపులు, హింస, బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీ లు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ముందుగా డబ్బులు అడిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉద్యోగ ప్రకటనలు, సంస్థల వివరాలను అధికారిక వనరుల ద్వారా నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని సూచించారు. తక్కువ వడ్డీకి తక్షణ రుణాలు ఇస్తామంటూ వచ్చే నకిలీ లోన్ యాప్‌లు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.లాటరీ లేదా బహుమతి గెలుచుకున్నారని చెప్పి పన్ను, ప్రాసెసింగ్ ఫీజు తదితర పేర్లతో డబ్బులు వసూలు చేసే మోసాలను నమ్మవద్దని ప్రజలకు వివరించారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని పోలీసులు సూచించారు. ఎన్నికల సమయంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, గుమ్మఘట్ట ఎస్ఐ జి. చిన్నారాయుడు కోరారు.



# చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల చిత్రంపై క్లారిటీ ఇచ్చిన నాని

మెగాస్టార్ చిరంజీవి, 'ప్యారడైజ్' దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ పై నీలినీడలు కమ్ముకున్నాయి. నేచురల్ స్టార్ నాని సమర్పకుడిగా, నిర్మాతగా వ్యవహరించనున్న ఈ చిత్రం ఇప్పట్లో పట్టాలెక్కేలా కనిపించడం లేదు. ఈ సినిమాకు మరికొంత సమయం పడుతుందని, దీనిపై ఇంకా ఎలాంటి తాజా చర్చలు జరగలేదని నాని స్వయంగా స్పష్టం చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న మెగా అభిమానులకు నిరాశే ఎదురైంది. ఇటీవల ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాని ఈ ప్రాజెక్ట్ ఆలస్యం కావడానికి గల కారణాలను వివరించారు. ది ప్యారడైజ్' సినిమా నిర్మాణం అనుకున్నదానికంటే ఎక్కువ సమయం తీసుకుందని, దీనివల్ల చిరంజీవి సినిమా షెడ్యూల్ దెబ్బతిందని తెలిపారు. "నిజానికి ఈపాటికి చిరంజీవి గారి సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉండాల్సింది. కానీ 'ది ప్యారడైజ్' ఆలస్యమవ్వడంతో కుదరలేదు. దీనిపై మేము ఇంకా కూర్చుని చర్చించుకోలేదు. దీనికి మరికొంత సమయం పడుతుంది" అని నాని స్పష్టం చేశారు. ఈలోగా చిరంజీవి కూడా కొన్ని ఇతర సినిమాలను పూర్తి చేశారని ఆయన పేర్కొన్నారు. 2024 డిసెంబర్ లో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోనే 'అత్యంత వయొలెంట్ సినిమా'గా ఇది రానుందని ప్రచారం జరగడంతో అంచనాలు ఆకాశాన్నంటాయి.



యంగ్ టాలెంటెడ్ డైరక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండటంతో ఈ కాంబినేషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, చిరంజీవి, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డేట్లు తిరిగి సర్దుబాటు అయ్యాక మాత్రమే ఈ ప్రాజెక్ట్‌పై తదుపరి అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది. సినిమా ఆలస్యమైనప్పటికీ, ఈ క్రేజీ కాంబినేషన్ కోసం మెగా అభిమానులు, సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## 'రణబాలి' సెట్‌లో విజయ్ చాలా సీరియస్ : ఆసక్తికర విషయాలు చెప్పిన రష్మిక

స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి తర్వాత కలిసి నటిస్తున్న తొలి చిత్రం 'రణబాలి'. పీరియడ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ చిత్రంలో తన భర్త విజయ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి రష్మిక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన రష్మిక, 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో భాగంగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. "'రణబాలి' సెట్‌లో విజయ్‌తో పనిచేయడం ఎలా అనిపించింది?" అని అభిమాని ప్రశ్నించగా.. రష్మిక స్పందించారు. "విజయ్‌తో పనిచేయడం ఎప్పుడూ సరదాగా ఉంటుంది. కానీ పని విషయానికి వస్తే, సెట్స్‌లో అతను చాలా సీరియస్‌గా, అంకితభావంతో ఉంటాడు. ఇది మీ అందరికీ తెలిసిన విషయమే. అతని నుంచి నేను కూడా ఎప్పటిలాగే చాలా విషయాలు నేర్చుకుంటాను" అని బదులిచ్చారు. మరోవైపు, ఈ సినిమా దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ కూడా ఇటీవల 'రణబాలి' గురించి ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు.

ఈ చిత్రంలో రష్మిక పోషిస్తున్న కథానాయిక పాత్రకు తన తల్లిగారైన 'జయమ్మ' పేరు పెట్టినట్లు ఆయన తెలిపారు. పాత కాలానికి చెందిన పాత్ర అయినప్పటికీ, నేటితరం మహిళలకు స్ఫూర్తినిచ్చేలా 'జయమ్మ' పాత్రను ఎంతో శ్రద్ధతో తీర్చిదిద్దినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే 'రణబాలి' సినిమా షూటింగ్ పూర్తయింది. 130 రోజుల పాటు నిర్విరామంగా సాగిన ఈ షూటింగ్ పూర్తయినట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మలయాళ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ... ఓటీటీలో!



మలయాళంలో సూపర్ హిట్ అనిపించుకున్న ఒక సినిమా ఇప్పుడు ఓటీటీ ద్వారా ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతోంది. ఆ సినిమా పేరే 'ప్రథమ ద్రుష్ట్యా కుట్టక్కర్'. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన సినిమా ఇది. పార్వతీ తిరువోతు ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, షహద్ నిలంబూర్ దర్శకత్వం వహించాడు. సెప్టెంబర్ 11వ తేదీన ఈ సినిమా అక్కడి థియేటర్లలో భారీస్థాయిలో విడుదలైంది. గట్టిపోటీని తట్టుకుని నిలబడి హిట్ టాక్ తెచ్చుకుంది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అవుతోంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను 'నెట్ ఫ్లిక్స్' వారు దక్కించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్టుగా అధికారికంగా ప్రకటించారు. పార్వతీ తిరువోతుతో పాటు మాథ్యూ థామస్ .. విజయ రాఘవన్ .. సిద్ధార్థ్ భరత్ కనిపించనున్నారు. ముజీబ్ మజీద్ అందించిన నేపథ్య సంగీతం కనెక్ట్ అవుతుందని అంటున్నారు. ఈ సినిమాలో 'అలీనా అబ్రహం' అనే కానిస్టేబుల్ పాత్రలో పార్వతీ తిరువోతు కనిపించనుంది. ఈ కథ పోలీస్ స్టేషన్ లో పోలీసుల చుట్టూ తిరుగుతుంది. పోలీస్ స్టేషన్ లో పోలీసుల కారణంగా ఒక నేరం జరుగుతుంది. ఆ నేరం తమ వలన జరిగిందనే విషయం బయటపడనీయకుండా పోలీసులు ఆధారాలు దొరక్కుండా చేయాలనుకుంటారు. వాళ్ల ప్లాన్ ఫలిస్తుందా? అనేది మిగతా కథ. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందనేది చూడాలి మరి,.



## 'చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకుంటుంది'.. అగార్కర్‌కు గంభీర్ ఎమోషనల్ మెసేజ్

టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఘనంగా వీడ్కోలు పలికాడు. అగార్కర్ హయాంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు గెలవడాన్ని గుర్తు చేసుకున్న గంభీర్.. భవిష్యత్తులో చరిత్ర అతడిని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుందని పేర్కొన్నాడు. "అజిత్ భాయ్.. మీతో కలిసి పనిచేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ హయాంలో సాధించిన మూడు ఐసీసీ ట్రోఫీలే మీ నమ్మకానికి నిదర్శనం. ఎప్పుడూ జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారు. చరిత్ర మిమ్మల్ని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుంది. ధన్యవాదాలు. మీ భవిష్యత్తుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని గంభీర్ 'ఎక్స్'లో పోస్టు చేశాడు. 2023 జులైలో అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో భారత్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్ సాధించింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న పరిమిత ఓవర్ల సిరీస్‌కు జట్లను ఎంపిక చేయడం అగార్కర్ చేపట్టిన చివరి బాధ్యతగా నిలిచింది. అగార్కర్ పదవీకాలం మంగళవారంతో అధికారికంగా ముగిసింది.



ఖాళీ అయిన సెలెక్టర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రస్తుతం మాజీ భారత స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20లు, భారత్-ఏ జట్టుకు సంబంధించిన మూడు మ్యాచ్‌ల కోసం జట్ల ఎంపికలో అతడు పాల్గొన్నాడు. సెలెక్షన్ ప్యానెల్‌లో ఓజాతో పాటు శివసుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ ఉన్నారు. కొత్త సెలెక్టర్ కోసం అక్టోబర్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థి కనీసం ఏడు టెస్టులు లేదా 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. మరో నిబంధన ప్రకారం ఐదు సంవత్సరాల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఉండాలి.

## 2027 వరల్డ్‌కప్ తర్వాత కోహ్లి రిటైర్ అవ్వడా? ఇంగ్లండ్ మాజీ స్టార్ సంచలన కామెంట్స్



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని కోహ్లీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చని పనేసర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల వన్డేల్లో కోహ్లీ 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లీ ఆటపై పనేసర్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో ఆటపై ఆకలి, దూకుడు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ తనను ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. కోహ్లీ శిక్షణ చూస్తే తాను కూడా జిమ్‌కు వెళ్లాలనిపిస్తుందని పేర్కొన్నాడు. "విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉంది. ప్రతి మ్యాచ్‌ను ఎంతో తీవ్రతతో ఆడతాడు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు. చుట్టూ ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తాడు. 10-15 మ్యాచ్‌లే మిగిలి ఉన్నాయని భావిస్తే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యేకంగా చూస్తాం. కోహ్లీ కూడా ప్రస్తుతం అదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాడు. ప్రతి బంతికి తన వంద శాతం ఇస్తున్నాడు. అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని నాకు అనిపించడం లేదు. అతడి నుంచి ఇంకా చాలా క్రికెట్ చూడొచ్చు" అని పనేసర్ చెప్పాడు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపైనా పనేసర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, అతడికి ప్రపంచకప్ జట్టులో అవకాశం ఇవ్వాలని అన్నాడు. రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని పేర్కొన్నాడు.



## స్మృతి మంధానకు కెప్టెన్సీ.. హర్మన్‌ప్రీత్ స్పందన ఇదే!

భారత మహిళల క్రికెట్ జట్టు సురక్షితమైన చేతుల్లోనే ఉందని, కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన స్మృతి మంధాన జట్టును విజయపథంలో ముందుకు నడిపిస్తుందన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని మాజీ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. దశాబ్దానికి పైగా జట్టును నడిపించిన తాను ఇప్పుడు కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నానని, స్మృతికి తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె స్పష్టం చేసింది. సుదీర్ఘకాలంగా స్మృతితో తనకు ఉన్న అనుబంధం, అవగాహన జట్టుకు మరింత మేలు చేస్తుందని హర్మన్‌ప్రీత్ అభిప్రాయపడింది. అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు హర్మన్‌ప్రీత్ ప్రకటించిన విషయం తెలిసిందే. 2012లో తొలిసారి పగ్గాలు చేపట్టిన ఆమె, తన నాయకత్వంలో జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించింది. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన తర్వాత ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ నిర్ణయం వెనుక ఏదో ఒక టోర్నమెంట్ ఫలితం కారణం కాదని, చాలాకాలంగా ఆలోచించి తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని ఆమె స్పష్టం చేసింది. ఐఏఎన్ఎస్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతూ హర్మన్‌ప్రీత్ తన మనసులోని మాటలను పంచుకుంది. "దశాబ్దానికి పైగా కెప్టెన్సీ బాధ్యతను గౌరవంగా భావించాను. జట్టు ప్రయోజనాలకే ఎప్పుడూ పెద్దపీట వేశాను. ఇప్పుడు నా ఆటను మరింత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. నా బ్యాటింగ్‌పై దృష్టి పెట్టడంతో పాటు, కుటుంబం, స్నేహితులతో గడిపేందుకు సమయం కేటాయించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అయితే, ఒక సీనియర్ ప్లేయర్‌గా, మెంటార్‌గా నా అనుభవంతో జట్టుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని వివరించింది. కొత్త కెప్టెన్ స్మృతి మంధానతో తనకున్న బంధం గురించి మాట్లాడుతూ, "నేను, స్మృతి మా కెరీర్‌లో కీలక దశలను కలిసే చూశాం. ట్రైనింగ్ నుంచి వీడియో గేమ్స్ ఆడే వరకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. మా మధ్య బలమైన అవగాహన ఉంది. ఇప్పుడు ఆమె కెప్టెన్సీలో నా పూర్తి సహకారం అందిస్తాను. మేమిద్దరం కలిసి ఈ జట్టును నిర్మించాం. కాబట్టి మా మధ్య ఉన్న నమ్మకం, శక్తి అలాగే కొనసాగుతుందని నేను కచ్చితంగా చెప్పగలను" అని హర్మన్‌ప్రీత్ వెల్లడించింది.

# పోషకాహారంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి

- బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- మహిళా శిశు సంక్షేమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- శాసనసభ్యులు షాజహాన్ బాషా
- అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి నిర్వహిస్తున్న పోషణ్ మాసం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మదనపల్లి పట్టణంలోని ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా **జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..** పోషకాహార లోపం నివారణతో పాటు మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, సంక్షేమం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, హెల్పర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయిలో అంగన్‌వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని, పోషకాహారంపై అవగాహనతో పాటు బాల్య వివాహాల నివారణ, టీనేజ్ గర్భధారణల నియంత్రణ, మలేరియా, కోవిడ్ తదితర అంశాల్లోనూ సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. చిరుధాన్యాలను ప్రజల రోజువారీ ఆహారంలో భాగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ పరిధిలోని లబ్ధిదారుల కుటుంబాల్లో చిరుధాన్యాల వినియోగం ఎంతవరకు పెరిగిందో ప్రత్యేకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వారానికి కనీసం రెండు, మూడు సార్లు చిరుధాన్యాలు తీసుకుంటున్నారా, తీసుకోకపోతే కారణాలేమిటో గుర్తించి తగిన కార్యాచరణ చేపట్టాలని సూచించారు.రాయలసీమలో సంప్రదాయంగా వినియోగించే జొన్నలు, కొర్రలు, అండుకొర్రలు తదితర చిరుధాన్యాలను అంగన్‌వాడీ కేంద్రాల ఆహారంలో భాగం చేసేలా ప్రతి ప్రాజెక్టు పరిధిలో కొన్ని కేంద్రాలను పైలట్‌గా ఎంపిక చేసి, వారానికి కనీసం ఒకరోజు చిరుధాన్యాలతో కూడిన ప్రత్యేక ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలు ఆందోళన కలిగించే అంశాలని, 18 సంవత్సరాల లోపు గర్భధారణలను నియంత్రించేందుకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, కార్యకర్తలు, హెల్పర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్థాయిలో నిరంతరం అవగాహన కల్పిస్తూ అవసరమైన సందర్భాల్లో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు.

మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పోషణ్ మాసం కార్యక్రమంతో పాటు పోషకాహారం, చిరుధాన్యాల వినియోగం, మహిళలు--చిన్నారుల




ఆరోగ్యం, బాల్య వివాహాల నివారణ, టీనేజ్ గర్భధారణల నియంత్రణపై సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.కార్యక్రమంలో **మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ....** చిన్నారుల సంరక్షణ, వారి భవిష్యత్ నిర్మాణంలో అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అమూల్యమన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ, ఒకరినొకరు గౌరవించుకునే విధంగా మంచి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సొంత భవనాలు అందుబాటులోకి వస్తే చిన్నారులకు మరింత మెరుగైన వసతులు కల్పించవచ్చన్నారు.కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. అక్టోబర్ 2న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి తాను చేసిన విజ్ఞప్తులపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టిందని తెలిపారు.ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఎంత ముఖ్యమో, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సహకారం కూడా అంతే అవసరమని, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సమర్థవంతమైన పాలన కొనసాగుతున్నందుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించి వారిని ఆశీర్వదించారు.



**అన్నమయ్య జిల్లాకు స్వచ్ఛ అంగన్‌వాడీ అవార్డులు--2026**

స్వచ్ఛ అంగన్‌వాడీ అవార్డులు--2026లో భాగంగా ఉత్తమ పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించినందుకు అన్నమయ్య జిల్లాకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలు, సిబ్బంది రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు.

**రాష్ట్ర స్థాయి అవార్డు**

లిమదనపల్లి బసినికొండ--2 అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన డి. విజయలక్ష్మీదేవి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు.

**జిల్లా స్థాయి అవార్డులు**

పుంగనూరు--గూడూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రం -- టి. నాగరత్నమ్మ,వాల్మీకిపురం--4 అంగన్‌వాడీ కేంద్రం -- ఎస్. నజమున్నిసా పీలేరు--ఎర్రంరెడ్డికుంట అంగన్‌వాడీ కేంద్రం -- జి. కళావతి కురబలకోట--2 అంగన్‌వాడీ కేంద్రం -- ఎ. లలితమ్మ,అంగన్‌వాడీ ఉత్సవ్, పోషణ్ మా కార్యక్రమాల్లో విశేష కృషికి సన్మానం

అంగన్‌వాడీ ఉత్సవ్, పోషణ్ మా కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయడంలో విశేషంగా కృషి చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఈ సందర్భంగా సన్మానించారు.బి.కొత్తకోటకు చెందిన పి. అంజలమ్మ, లక్కిరెడ్డిపల్లికి చెందిన టి. నాగరాణి, మదనపల్లికి చెందిన డి.ఆర్. మధురవాణి, పీలేరుకు చెందిన ఎస్. అన్నపూర్ణ, పుంగనూరుకు చెందిన జి. రోజా, రాయచోటికి చెందిన ఎన్. ఓబులమ్మ, తంబళ్లపల్లికి చెందిన మిరియాల రమాదేవి, వాల్మీకిపురానికి చెందిన ఎం. గులాబ్జన్లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా దుశ్శాలువాతో సత్కరించి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే షాజహాన్ బాషా జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పీడీ హైమవతి, సీడీపీవోలు సుజాత రెడ్డి, నాగవేణి, రాజేశ్వరి, భారతి, రెడ్డి రమణమ్మ, భాగ్యమ్మ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలి

### -రాయచోటి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆర్. అమీర్ భాష



**రాయచోటి-సూర్య వాస్తవం:** ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శకత, జవాబుదారీ తనం అవసరమని రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆర్ అమీర్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం నిర్ణయాలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, సమిష్టి నిర్ణయ ప్రక్రియ ద్వారా జరగాలని అన్నారు. ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అని ప్రజా సేవ చేయాలనే ఆసక్తి, పార్టీ పట్ల నిబద్ధత ఉన్న నాయకులు, కార్యకర్తలు ముందుకు వచ్చి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆటో--జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** సుండుపల్లి మండల కేంద్రంలోని అగ్రహారం వద్ద బుధవారం రాత్రి ఆటోను జేసీబీ ఢీకొన్న ప్రమాదంలో తిమ్మసముద్రం హరిజనవాడకు చెందిన మల్లేపల్లి మనోహర్ (55) మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.. బలిజపల్లె రోడ్డు నుంచి పీలేరు రోడ్డుకు వస్తుండగా మలుపు వద్ద సుండుపల్లె వైపు వెళ్తున్న ఆటోను జేసీబీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మనోహర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి రాయచోటి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనతో తిమ్మసముద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నేడు స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ కీలక భేటీ

### -ఆంధ్రప్రదేశ్ : స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముమ్మరం చేసింది

**విజయవాడ-సూర్య వాస్తవం:** ఎన్నికల నిర్వహణకు సంబంధించి క్షేత్ర స్థాయిలో కొనసాగుతున్న ఏర్పాట్లను సమీక్షించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్రపునేఠ నేడు గురువారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ నగర పోలీసు కమిషనర్లతో పాటు ఆయా జిల్లాల జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, నగర, పట్టణ మున్సిపల్ కమిషనర్లతో కీలక సమావేశంనిర్వహించనున్నారని సమాచారం. బుధవారమే ఈ సమావేశం నిర్వహణకు ఏర్పాటు చేయగా, రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కారణంగా సమావేశం నేటికి వాయిదా పడిందని తెలిసింది.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140

## వినియోగదారుల సమస్యలపై విజిలెన్స్ కమిటీ చర్చ
### సేవల మెరుగుదలపై అధికారులతో కమిటీ సమీక్ష



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం బుధవారం ఉదయం 11.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్, అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా డీఎస్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు తోట చెన్నప్ప, షేక్ హాసిన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వినియోగదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై కమిటీ సభ్యులు అధికారులతో చర్చించారు. వినియోగదారులకు అందుతున్న సేవలు, సమస్యల పరిష్కారం, సంబంధిత శాఖల ద్వారా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలని కమిటీ సభ్యులు సూచించారు.

## పారిశ్రామిక అభివృద్ధికి పెట్టుబడులు ఆహ్వానం

**- డి.హీరేహాల్‌లో ఆపిల్ ఇండస్ట్రీస్‌ను సందర్శించిన కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** డి.హీరేహాల్ మండలంలోని ఆపిల్ ఇండస్ట్రీస్‌ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమలోని కార్యకలాపాలను పరిశీలించి, పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ నెల 23వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో పరిశ్రమల ప్రతినిధులు పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమల విస్తరణకు లేదా నూతన యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న కంపెనీలు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై అవగాహనతో పాటు, ఆసక్తి ఉన్న సంస్థలు అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, జీఎం డీఐసీ శ్రీనివాస్ యాదవ్, ఆపిల్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పితృవియోగం కలిగిన జోజోడే కుమార్





**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో ప్రముఖ టెక్స్ టైల్ వ్యాపారవేత్త, ఆర్ఎస్ఎస్ నాయకులు జోజోడే కుమార్ తండ్రి జోజోడే శంకరరావు (77) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. హనుమాన్ టాకీస్ రోడ్డులోని స్వగృహంలో ఆయన పార్థివదేహంను సందర్శించుకొనుటకు మండలంలోని అఖిలపక్ష నాయకులు, బావసార క్షత్రియ కులస్తులు వందలాదిమంది పాల్గొని ప్రగాఢ సంతాపం తెలుపుచున్నారు. ఈయన అంత్యక్రియలు శుక్రవారం 10 గంటలకు భావసార క్షత్రియ సమాజ్ వైకుంఠ దామంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## శభాష్ గంగసాని మోహన్..!

**- శభాష్‌పురం తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం**

**- గంగసాని మోహన్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు**

**పత్తికొండ - సూర్య వాస్తవం :** తుగ్గలి మండలంలోని శభాష్‌పురం గ్రామంలో తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గత కొన్ని రోజులుగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజల సమస్యను టీడీపీ యూత్ లీడర్ గంగసాని మోహన్ గుర్తించారు. గ్రామస్తుల ఇబ్బందులను పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలు, చొరవతో గ్రామంలో తాగునీటి బోరు పనులు చేపట్టి పూర్తి చేయించారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న సమయంలో స్పందించి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన గంగసాని మోహన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తాగునీటి సమస్య పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే శ్యాంబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.



## డి.హీరేహాల్‌లో కలెక్టర్ విస్తృత పర్యటన

**- అంగన్‌వాడీ నుంచి పాఠశాల వరకు కలెక్టర్ తనిఖీలు**

**- శానిటరీ కాంప్లెక్స్ పనులు త్వరగా పూర్తి చేయాలి**

**- విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి.. డ్రాప్‌అవుట్స్‌కు తావులేదు**

**- విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచన**

**- స్వయం సహాయక సంఘాల పనితీరు, రికవరీపై సమీక్ష**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** డి.హీరేహాల్ మండలంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని కోట వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, చిన్నారులకు అందిస్తున్న మెనూ, భోజన వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డీఆర్డీఏ వెలుగు కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్.. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపడుతున్న శానిటరీ కాంప్లెక్స్, మరుగుదొడ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల పనితీరు, రికవరీ, ఆర్థిక పురోగతి, ఓవర్‌డ్యూల వివరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తదుపరి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం మడేనహళ్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏ విద్యార్థి పాఠశాలకు దూరం కాకుండా చూడాలని, డ్రాప్‌అవుట్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండరాదని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దాస నాయక్, ఏపీఎం రామకృష్ణ, సీసీలు, యానిమేటర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## శిక్షణలో నేర్చుకున్న పాఠాలను విధుల్లో ఆచరించాలి

**- ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి**

**- క్రమశిక్షణ, సమయపాలనతో విధులు నిర్వహించాలి**

**- 279 మంది ఎస్‌సీటీపీసీ కానిస్టేబుళ్లకు ఎస్పీ పి.జగదీష్ దిశానిర్దేశం**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఒంగోలు పీటీసీ, కడప డీటీసీల్లో ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న 279 మంది ఎస్‌సీటీపీసీ కానిస్టేబుళ్లతో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కానిస్టేబుళు క్రమశిక్షణ, సమయపాలన, అప్రమత్తత, బృంద స్ఫూర్తితో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను ఓర్పుగా విని, వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను కూడా పెంపొందించు కోవాలని తెలిపారు. ప్రాథమిక శిక్షణ అనంతరం మరో 45 రోజుల పాటు క్షేత్రస్థాయి విధులతో పాటు అనంతపురం డీటీసీలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందులో ఫుట్ పెట్రోలింగ్, కార్డన్ అండ్ సెర్చ్, డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు, నేర నియంత్రణ, రాత్రి గస్తీ, ఎస్కార్ట్, ముఖ్య వ్యక్తుల భద్రత, పోలీస్ స్టేషన్, రికార్డు వర్క్, బందోబస్తు తదితర అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నారు. ఆత్మ విశ్వాసం, అంకితభావంతో విధులు నిర్వహించి అనంతపురం జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ పి. జగదీష్ ఆకాంక్షించారు.

# మదనపల్లిలో ఘనంగా పోషణ్ మాహ్ ముగింపు

**- పోషణ్ మాహ్‌ను విజయవంతం చేసిన సీడీపీఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సన్మానం**



**మదనపల్లి - సూర్య వాస్తవం :** మదనపల్లిలోని ఆర్.ఆర్. ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోషణ్ మాహ్ ముగింపు కార్యక్రమం విజయవంతంగా జరిగింది. అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, మదన పల్లి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా పనిచేసిన పీలేరు సీడీపీఓ రెడ్డి రమణమ్మను కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. అలాగే పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను సైతం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ్ మాహ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పోషకాహారం, ఆరోగ్యం, శిశు సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.